ప్రజాశక్తి
ఆదివారం 9 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం



గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో ఉన్న జిల్లాలోని బాల, బాలికల గురుకులాల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా సమన్వయాధికారి బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7నుంచి వచ్చే నెల 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ప్రవేశాల కోసం https://apbragcet.apcfss.in సైట్‌ను సందర్శించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు. గురుకులాల్లో చేరేందుకు ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2012 సెప్టెంబరు 1, 2016 ఆగస్టు 2016 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్ దరఖాస్తు చేసుకునే వారు 17 ఏళ్ల వయసు మించకూడదన్నారు. ఇతర వివరాల కోసం గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయ అధికారి 9701736862, 9000314209 సెల్ ఫోన్ నంబర్లకు, 08942 279926 ల్యాండ్‌లైన్ నంబరును సంప్రదించాలని సూచించారు.





శ్రమిస్తే విజయం మీదే

- ప్రణాళికే ముఖ్యం
- ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- ఫిబ్రవరి, మార్చిలో పరీక్షల కాలం

'శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ భానిస అవుతుంది' అన్న మేధావులు స్ఫూర్తిదాయక మాటలకు ఫలితం లభించనుంది. భావిభారత విద్యార్థులకు భవిష్యత్ కలల సాకారానికి సమయం ఆసన్నమైంది. ఏడాది పాటుగా చదివిన చదువులకు నిర్దిష్ట లక్ష్యం ఏర్పడే సమయం దగ్గర పడింది. విద్యార్థులకు కీలకమైన పరీక్షల కాలం దగ్గర పడింది.

ఈ నెల పది ఇంటర్ ప్రాక్టికల్, పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన కాలనిర్ణయ పట్టికలు వెలువడ్డాయి. మార్చి నెల అంటేనే వార్షిక పరీక్షల సీజన్ కావడంతో ఇటు విద్యార్థుల్లోను, అటు తల్లిదండ్రుల్లోను టెన్షన్ ప్రారంభమైంది. ప్రధానంగా ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి.

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కొద్ది రోజుల్లో ప్రశ్నాపత్రాలు ఆయా పోలీస్‌స్టేషన్లకు చేరుకొనున్నాయి. విద్యార్థుల్లో ఇప్పటికే పరీక్షల ఫీవర్ ప్రారంభమైంది.

ప్రజాశక్తి- టెక్కలి

పరీక్షలంటే విద్యార్థులు ముందుగా భయాన్ని విడనాడాలి. పరీక్షలన్న ఫోబియా నుంచి బయట పడి ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలి. ఈ పరీక్షలు మనమే బాగా రాయగలం. మనకన్నా ఎవరు బాగా రాయలేరనే ఆత్మవిశ్వాసాన్ని తనకి తానుగా సృష్టించుకోవాలి. అందుకు విద్యార్థులు మానసికంగా సిద్ధం కావాల్సి ఉంది. ఇప్పటి వరకు మనం చదివిన పాఠ్యాంశాల్లోని ప్రశ్నలే వస్తాయనే నమ్మకాన్ని పెంపొందించుకోవాలి. మనకన్న ఎవరూ తెలివైన వారు కాదు... లేరు మనకి మనమే తెలివైన వారం అనే భావన కలిగి ఉండాలి. ఇందుకు పరీక్షలు అన్న భయాన్ని ముందుగా విడనాడాలి.

పునశ్చరణ అవసరం

పరీక్షలు సమయం దగ్గర పడుతుండడంతో ఇంక చదువులు మీద కంటస్థం పెట్టే విధానంపై దృష్టి పెట్టకూడదు. ఇప్పటి వరకు తాను చదివిన అంశాలపై, పాఠ్యాంశాలపై అవగాహన ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పటి వరకు నేర్చిన, చదివిన అంశాలపై పునశ్చరణ చేసుకోవాలి. తాను చదివిన పాఠాలు, ఏ మేరకు గుర్తు ఉన్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలు ఇంకా ఏమైనా మరిచిపోయామా? అనే దానిపై దృష్టి పెట్టి పునశ్చరణ చేసుకోవడం ముఖ్యం. తోటి విద్యార్థులతో కలిసినప్పుడు సంబంధిత పాఠ్యాంశాలపై, పాఠాలపై చర్చలు అవసరం. దీనిద్వారా మనం మరిచిపోయిన విషయాలు మరలా మనకి గుర్తుకు వస్తాయి. ఇలా కూడా రాయవచ్చా అనే సందేహం నివృత్తి అవుతుంది.

ఆరోగ్యం అవసరం

పరీక్షలు అన్న భయం వల్ల విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. ఒకపక్క పరీక్షలన్న ఫీవర్, మరోపక్క చదవాలి అనే ఆరాటంతో తిండి మీద దృష్టి పెట్టరు. ఇటువంటి సమయాల్లోనే విద్యార్థులకు ఆరోగ్యాలు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడతాయి. సరైన సమయానికి తిండి, మంచి నిద్ర చేసినప్పుడు మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. ఇదే సమయాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పౌష్టికాహారం కలిగిన వంటకాలు చేసి పెట్టాలి. వాటిని వారి తిని జీర్ణించుకోగలిగే వంటలపైనే దృష్టి పెట్టాలి. అదే సమయంలో నిద్రపైనా దృష్టిసారించాలి. ఇలా చేస్తే పరీక్షల్లో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది.

అనవసర ఆలోచనలు వద్దు

పరీక్షలు వేళ అనవసర ఆలోచనలపై మన మనసు వెల్లకూడదు. ఎందుకంటే సంవత్సరాల తరబడి మనం చదివిన చదువులకు కొలమానంగా ఉన్న పరీక్షల సమయం మనకు దగ్గరపడుతుండడంతో అనవసర విషయాలపై దృష్టిని మరల్చకూడదు. మన ముందున్న లక్ష్యం ఒక్కటే మనకి కనిపించాలి. ఇన్నాళ్లుగా మనం చదివిన చదువులకు పూర్తి సాధికారత లభిస్తుందనే ఆశతో ఉన్నవాళ్లం. అందుకు ఎన ఆలోచలు మంచి విషయాలపై పెట్టాలి. అప్పుడే మనం మానసికంగా సిద్ధంగా ఉంటాం.

సరదాగా ఉండాలి

పరీక్షలు అన్న ఆందోళనని పక్కన బెట్టి మిత్రులతోనో, సన్నిహితులతోనో సరదాగా గడపండి. ఎందుకంటే నవ్వుకుంటే మానసికంగా బలం చేకూర్చుతుంది. అందుకే రోజూ ఆర గంట సేపు సరదాగా ఉండడానికి ప్రయత్నం చేయాలి.

భయపడొద్దు



పరీక్షలంటే విద్యార్థుల్లో చాలా వరకు భయం ఉంటుంది. దీని వల్ల వారు మానసికంగా ఇబ్బందులను ఎదుర్కొంటారు. అందుకే పరీక్షలంటే భయం వీడాలి. కొద్ది సేపు సరదాగా గడు పుతుండాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. చిన్నపాటి పరిస్థితులపై ఆరోగ్య పరంగా ఆందోళన కలిగిస్తే ఖంగారు పడాల్సిన అవసరం లేదు. ఇంటి చిట్కాలు ముందు పాటించి అప్పటికీ నయం కాకపోతే అప్పుడు డాక్టర్‌ని సంప్రదించండి. కొద్ది రకాల ఔషధాలు మన దగ్గర భద్రపర్చుకోవచ్చు. ప్రశాంతంగా కూర్చుని ఆలోచిస్తే కొంత ఆనారోగ్యం దూరమవుతుంది. కావున ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి.

- లక్షణరావు, టెక్కలి ఆస్పత్రి వైద్యాధికారి

ఆత్మస్థైర్యం అవసరం



మరి కొద్ది రోజుల్లో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ప్రణాళికాపరంగా రాయాలి. మనం రాసే ప్రశ్నా పత్రం ఏ విధానంలో ఇచ్చారో అన్నది పరిశీలించాలి. చదివిన విషయాలే వచ్చాయన్న ఒక సంతృప్తి భావనకు రావాలి. సమాధాన పత్రాన్ని రాసేముందు ఆలోచించుకుని మనకు ఏది బాగా వస్తే దానిని ముందుగా జవాబు పత్రంలో రాయాలి. రాసే ప్రతి అంశమూ నిశితంగా పరిశీలించి సమాధానాన్ని పొందుపర్చాలి. ప్రతి పరీక్షకూ మానసిక ఆత్మస్థైర్యం అవసరం. వీటిని కొనసాగిస్తూ రాసే క్రమంలో ప్రణాళికను కూడా రూపొందించుకొని దానిప్రకారం జవాబులు రావాలి.

- లమ్మత శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

ఏర్పాట్లు చేస్తున్నాం



పరీక్షలను దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చూస్తున్నాం. ఇప్పటికే పరీక్ష కేంద్రాల జాబితా రూపొందించి సిద్ధం చేశాం. అలాగే ఇన్విజిలేటర్ల నియామకంలో నిబంధనలు పాటిస్తూ... వారి జాబితా కూడా సిద్ధం చేశాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కావాల్సిన తనిఖీల బృందాలను సిద్ధం చేశాం. కొన్ని కేంద్రాల్లో అవసరమైన చోట్ల సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తాం. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పన కూడా చేపడుతున్నాం.

- పి.విలియమ్స్, డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి, టెక్కలి



ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న మురళీధర్ యాదవ్

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడం తీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఖరీఫ్‌కు చెందిన ధాన్యం నిల్వలు ఉన్నా... అధికారులు కొనుగోలు లక్ష్యం పూర్తయిందంటూ చెబుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఫోన్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు చేస్తూ ఆమదాలవలస నియోజకవర్గ రైతులపై నిర్లక్ష్యం చూపడం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులను కోరారు. పట్టణంలోని 17 వ వార్డు లోని పూజారిపేటలో మురుగు కాలువ అధ్వన స్థితిలో ఉందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా సిటిజన్ ఫోరం అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు వినతిపత్రం అందజేశారు. జిఒ నంబరు 117ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసినా... దానిలో భాగంగా విద్యా వ్యవస్థలో కొన్ని మార్పు తీసుకురావడానికి సిద్ధమయ్యిందని అన్నారు. దీనిలో భాగంగానే మెట్టక్కివలసలోని పదో వార్డులోని హడ్కో కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల నుంచి 3 4 5 తరగతులకు చెందిన 17 మంది విద్యార్థులను సమీప వార్డులోని ప్రాథమిక పాఠశాలలో కలిపి మోడల్ స్కూల్‌గా చేయాలని ప్రతిపాదించారని అన్నారు. అలాగే అక్కడ ఉన్న ఒకటి, రెండు తరగతులకు చెందిన విద్యార్థులను అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలతో కలిపి ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేయడానికి ప్రభుత్వం పూనుకుందని, ఈ ప్రతిపాదనను నిలిపివేయాలని పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నాగళ్ల మురళీధర్ యాదవ్ కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయకులు మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, తంగి గురయ్య, తోట రాము పాల్గొన్నారు.

పోలాకి : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. మండలంలోని కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ఫిర్యాదులో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు వినతిపత్రాలను అందజేశారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు.



పోలాకి : వినతిపత్రం అందజేస్తున్న రైతులు

11,12న బంద్

ప్రజాశక్తి- కొత్తూరు

రాజ్యాంగ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 1/70 చట్ట సవరణ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ 1/70 పరిరక్షణకు ఈ నెల 11 ,12 తేదీల్లో 48 గంటల పాటు నిర్వహించనున్న రాష్ట్ర ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ పది రోజుల కిందట విశాఖపట్నంలో పారిశ్రామికవేత్తల సమావేశంలో స్పీకర్ టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం ఆటంకంగా ఉందని, సవరించడానికి అధికారులు లోతైన అధ్యయనం చేయాలని పిలుపును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం గిరిజనులపై తన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, గిరిజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజనులు గేదెల ఎండయ్య, ఆరిక గణపతి, గేదెల హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పన్న

ప్రజా సమస్యలపై పోరాడేది వామపక్షాలే

- సమ సమాజ స్థాపనే యువత లక్ష్యం
- ఎఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా సమస్యలపై పోరాడేది వామపక్ష నాయకులేనని, సమ సమాజ స్థాపనకు యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. నగరంలోని అరసవల్లిలో ఉన్న సూర్యతేజ కన్వెన్షన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పాలన సాగిస్తున్న బూర్జువా పార్టీలను సాగనంపేందుకు యువత కదలి రావాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో ఆర్థిక నేరస్తులు, నేర చరిత్ర ఉన్నవారిని పంపడం వల్ల పేదలకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఉన్నప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, ప్రజల ప్రజల పక్షాన నిలబడి ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఉద్యమాల్లో పెద్దఎత్తున భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని గద్దెనెక్కి తొమ్మిది నెలల్లో ఏ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. యువత మత్తుకు బానిసలు కావద్దని ఆయన కోరారు. ఎపి ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలతో సాగుతున్న బిజెపి ప్రజలను మభ్యపెట్టి కార్పొరేట్లకు సంపదను దోచిపెడుతోందన్నారు. ఆ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు సిద్ధపడాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, రాష్ట్ర నాయకులు సిహెచ్.గీత, పి.సంతోష్‌కుమార్‌ల అధ్యక్ష వర్గంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, కర్ణాటక అధ్యక్షులు హరీష్‌బాల, ఆహ్వాన సంఘం అధ్యక్షులు చాపర సుందర్‌లాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

రాష్ట్ర అధ్యక్షునిగా యుగంధర్

అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన మొజ్జాడ యుగంధర్ తొలిసారి ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా పరుచూరి రాజేంద్రబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.సంతోష్ కుమార్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షునిగా సిహెచ్.గీత, పి.ప్రభాకర్, కె.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా కె.రవి, వై.బాబీ, షేక్ సుభానీ, జి.నాగరాముడు, కోశాధికారిగా వై.రాంబాబులను ఎన్నుకున్నారు.

వీడుతున్న డబుల్ ఇంజిన్ సర్కార్ అభివృద్ధి భ్రమలు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు కేటాయింపులు అంతా షరామామూలే. ప్రతి బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాకు ఏవో వరాలు ప్రకటిస్తుందని, ప్రాజెక్టులు కేటాయిస్తుందని ఎదురు చూడటం, తర్వాత బడ్జెట్ చూసి నిట్టూర్చుడం సర్వసాధారణమైపోయింది. కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు ఇప్పటివరకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు ఒకెత్తయితే... ఈ సారి బడ్జెట్ మరో ఎత్తు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం టిడిపి మద్దతుపై ఆధారపడటంతో బడ్జెట్‌పై ప్రజల్లో ఆశలు ఉండటం సహజం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అంతా అభివృద్ధే అంటూ పదేపదే గొప్పలు చెప్పిన కూటమి నాయకుల మాటలు తేలిపోయాయి. బడ్జెట్‌లో సాధారణ కేటాయింపులు మినహా ప్రత్యేకించి నిధులు, ప్రాజెక్టులేవీ లేకపోవడంతో తమకు అన్యాయం జరిగిందనే భావన జిల్లా ప్రజల్లో నెలకొంది. వెనుకబడిన ప్రాంతాలకు ఏడాదికి రూ. 50 కోట్ల గ్రాంట్ ఇస్తామని గతేడాది జూలై బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం.. ఈ సారి అదీ కూడా లేదు. విభజన చట్టంలో పేర్కొన మేరకు వెనుకబడిన ప్రాంత ప్యాకేజీ కింద రాయలసీమలోని నాలుగు జిల్లాలు, శ్రీకాకుళంతో సహా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు గ్రాంట్ల రూపంలో సాయం అందించనున్నట్లు జూలై నెలలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికీ ఆ సాయం అందించకపోగా ప్రస్తుత బడ్జెట్‌లో కనీసం దాని ప్రస్తావన లేదు. జిల్లాకు ఏమీ ఇవ్వకపోగా ప్రమాదకర అణు విద్యుత్కేంద్రం పనులకు ఊతమిచ్చేలా వికసిత్ భారత్-2047లో భాగంగా న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో ప్రయివేట్‌కు సహకారమందిస్తామంటూ బడ్జెట్‌లో ప్రకటించడంతో అందరిలోనూ ఆందోళన రేపుతోంది. రణస్థలం మండలం కొవ్వాడలో 1208 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు అణు రియాక్టర్ల ఏర్పాటుకు 2017లో టిడిపి హయాంలో 2079 ఎకరాలను సేకరించారు. జిల్లా అధికారులు రూపొందించిన విజన్ 2024-29 డాక్యుమెంట్‌లో జిల్లాలో పారిశ్రామిక, గృహ అవసరాలకు అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను పొందుపరిచారు. చంద్రబాబు కోరికను మోడీ నెరవేరుస్తున్నట్లుగా కనిపిస్తోంది.

జీడి పంటకు మద్దతు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామంటూ పలాస ఎన్నికల ప్రచారంలో చెప్పిన చంద్రబాబు వారికి న్యాయం చేసే విషయంలో చొరవ చూపకుండా పైకి ప్రేమ కనబరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గించడం వల్లే ఆఫ్రికా దేశాల దేశాల నుంచి జిల్లాకు వెల్లువలా జీడి పప్పు వచ్చి పడుతోంది. దానిని తట్టుకోలేక ఇక్కడ రైతాంగం చతికిలబడుతోంది. జీడి రైతులకు నిజంగా బాబు మేలు చేయాలనుకుంటే ఈ బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని పెంచేలా కేంద్రంపై ఒత్తిడి చేసేవారు. జిల్లాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. కవిటి ప్రాంతంలో గతంలో భూ సేకరణ కూడా చేశారు. రైతులకు, జిల్లా ప్రజలకు మేలు చేసే ప్రాజెక్టులు, పథకాలను వదిలేసి చంద్రబాబు పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి అంటూ పాత రాగమే ఆలపిస్తున్నారు. మూలపేట పోర్టు, దాని పక్కనే 10 వేల ఎకరాలతో ఇండస్ట్రియల్ కారిడర్ ఏర్పాటు చేస్తామంటూ చెప్తున్నారు. జిల్లాకు ఎయిర్ పోర్టు వస్తుందంటూ చంద్రబాబుతో సహా టిడిపి నేతలు ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారు. రాష్ట్ర, జిల్లా ప్రజల అవసరాలను వదిలేసి కార్పొరేట్లు, పారిశ్రామిక వేత్తల కోసం చంద్రబాబు పరితపిస్తున్నారు. పారిశ్రామిక కారిడర్ ఏర్పాటుకు సంతబొమ్మాళి మండలం నౌపడా ప్రాంతంలో ఉన్న 10 వేల ఎకరాల ఉప్పు భూములను తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి చూపినా టిడిపి నేతలు చాలా గొప్ప బడ్జెటంటూ కీర్తిస్తున్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమంటూ వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకాశానకెత్తేశారు. రైతులు, మహిళలు, యువత, మధ్య తరగతి ప్రజలకు లబ్ధికలిగేలా ఉందంటూ వ్యాఖ్యానించారు. రైతులకు సబ్సిడీ పెంచకుండా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణ పరిమితిని రూ.3 నుంచి రూ.5 లక్షలకు పెంచడాన్ని ఆహ్వానించారు. రాష్ట్రానికి ఇవ్వకపోయినా బిజెపి పాలిత రాష్ట్రమైన అస్సాంలో యూరియా ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటిస్తే... మంత్రి అచ్చెన్నాయుడు స్వాగతించారు. కూటమిలోని ఇతర పార్టీలైన జనసేనకు ఆ సోదే లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో జిల్లాకు ఏమీ ఇవ్వకపోయినా పర్వాలేదు కాని తమ వాటా మేరకు పదవులు కావాలని కూటమికి నాయకత్వం వహిస్తున్న టిడిపి ముందు డిమాండ్‌గా ఉంచుతోంది. బడ్జెట్‌లో రిక్తహస్తం చూపించడంతో డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పే కాషాయ పార్టీని చూసి జనం చీత్కరిస్తున్నారు. బడ్జెట్‌లో ఏమి ఇవ్వకపోయినా అంతా బాగుందని కేంద్రంలో భాగస్వామిగా ఉన్న పార్టీలు చెప్పుకోవడం సహజం.

తమకు 11 సీట్లు వచ్చినా 40 శాతం ఓట్ షేర్ ఉందని చెప్పుకుంటున్న వైసిపి రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా మాట్లాకపోవడం విచారకరం. ప్రతిపక్ష పార్టీగా కేంద్ర చేస్తున్న దగాను, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైన బాబును నిలదీసే అవకాశాన్ని వదులుకుంది. రాష్ట్ర నేతలు విషయం పక్కన పెడితే జిల్లాకు చెందిన నాయకులు బడ్జెట్‌పై మాట్లాడలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం, చంద్రబాబుపై రాజకీయ విమర్శలకు పరిమితమవతున్నారు తప్ప కూటమి ప్రభుత్వాన్ని దోషిగా నిలబట్టే అవకాశాలను వదులుకుంటున్నారు. బడ్జెట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎవరికి మేలు దల్చుకుందో అవగాహన కల్పిస్తూ ఎపి రైతు సంఘం, సిఐటియు చేపట్టిన బడ్జెట్ ప్రతుల దహన కార్యక్రమం ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలిసినట్లయింది. మరోవైపు సిపిఎం ఇతర వామపక్ష పార్టీలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిరసనల ద్వారా ప్రజలకు వాస్తవాలను వివరించాలని నిర్ణయించాయి. అధికార పక్షం అన్యాయం, ప్రతిపక్షం మౌనంతో నష్టపోతున్న ప్రజలకు నిజాలు చెప్పేందుకు సిపిఎం, వామపక్షాలు, కార్మిక, రైతు సంఘాలు చొరవ చూపడం అభినందనీయం.



ఎన్నికైన కార్యదర్శుల సంఘం నాయకులు

కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షునిగా అమర్‌నాథ్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నికలు నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బడగల పూర్ణ చంద్రరావు, సహాయక ఎన్నికల అధికారిగా బి.నవీన్‌లు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా మెట్ట అమర్‌నాథ్, జనరల్ సెక్రటరీగా గొండు తిరుమలరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వై.జ్యోతి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.రాము, ట్రెజరర్‌గా వై.ఎస్.ఆర్.మూర్తి, జాయింట్ సెక్రటరీలుగా పోలాకి మోహన్, కె.వినోద్, బి.రామకృష్ణ, ఎం.ప్రహ్లాద్, ఉపాధ్యక్షులు జి.శ్రీనురెడ్డి, పి.సోమేశ్వరరావు, బెహరా హిమబిందు, ఎం.శాంతకుమారిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అభినందించారు. ఎన్నికల అనంతరం అమర్‌నాథ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తున్న క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు సంఘాన్ని మరింత బలోపేతం చేసి ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమవుతామని తెలిపారు.

స్టాక్‌లో తేడాలు ఉంటే కేసులు

వజ్రపుకొత్తూరు: పౌర సరఫరాల దుకాణాల్లో ప్రజలకు అందించే సరుకుల్లో తేడాలు ఉంటే కేసులు తప్పవని డిటి మురళీకృష్ణ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు శనివారం మండలంలోని 15 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవునల్తాడలోని షాపును తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో ఉన్న సరుకులకు గ్రౌండ్ లెవిల్ ఉన్న సరుకుల మధ్య తేడాను పరిశీలించారు. కొంత మేర పంపిణీ కావడంతో సరుకుల్లో ఎలాంటి వ్యత్యాసం లేదన్నారు. అలాగే రేషన్ దుకాణాలు వద్ద ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డులు ఉంచాలని డీలర్లను ఆదేశించారు. ఈయతో పాటు డీలర్ల సంఘం ప్రతినిధులు బి.తవిటయ్య, ధనుంజయరావు తదితరులు ఉన్నారు.


సన్మానిస్తున్న సంఘ నాయకులు

చేసిన సేవలకే అవార్డులు

ప్రజాశక్తి- పలాస
ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని, అవార్డు లభిస్తాయని గిరిజన జిల్లా జెఎసి అధ్యక్షులు సవర రాంబాబు అన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న అధికారులకు ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సవర జగన్నాయకులు, సవర మోహనరావు, చిరంజీవి, సవర దావీదులు అవార్డులను అందుకున్నారు. పలాసలో ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంఘం ఆధ్వర్యాన అవార్డు గ్రహీతలకు శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు గిరిజన ఉద్యోగులకు ప్రభుత్వ శాఖల్లో మంచి గుర్తింపునివ్వడం, అవార్డులు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి అవార్డులు ప్రకటించడం ద్వారా ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్దింటి ఈశ్వరరావు, లోకేశ్వరావు, సవర శ్రీరంగులు, చంద్రశేఖర్, రామారావు, సిద్దు, అంగధుడు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మనుగడకు ముప్పు లేదు
మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ

ప్రజాశక్తి- బూర్జ
బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలోని గిరిజన గ్రామాల సమీపంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు వలన గిరిజనుల మనుగడకు ఎటువంటి ముప్పు వాటిల్లదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. శనివారం పెద్దపేట ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు కలగవన్నారు. ప్రతి ఒక్కరికి గాలి, నీరుతో పాటు విద్యుత్ కూడా ఎంతో అవసరమన్నారు. పవర్‌ప్లాంట్ ఏర్పాటుతో గిరిజనులకు ఎటువంటి హాని జరగదన్నారు. ఒకవేళ గిరిజనులకు నష్టం జరుగుతుందంటే ముందుగా వ్యతిరేకించేది తామేనని స్పష్టం చేశారు. పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.


మాట్లాడుతున్న రామకృష్ణనాయుడు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

ప్రీస్కూళ్ల విధానంతో సత్ఫలితాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
చిన్నారులకు ఆటపాటల్లోనూ మానసిక ఉల్లాసాన్ని కలిగించడంలో ప్రీస్కూల్ విద్యా విధానం ఎంతో మంచి ఫలితాన్ని ఇస్తున్నాయని మీనాక్షి ఆస్పత్రి అధినేత డాక్టర్ గొండు గంగాధర్ అన్నారు. నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న శిశుపాల్ ప్రీస్కూల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుద్దేశించి మాట్లాడారు. చిన్నతనం నుంచే ఒత్తిడి లేని విద్యా విధానం అమలు చేయడం వల్ల పిల్లల ఎదుగుదల, పరిజ్ఞానం పొందడానికి దోహద పడుతుందన్నారు. ప్రీస్కూల్ విధానం ద్వారా పిల్లల్లో మెచ్యూరిటీ లెవెల్స్ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం ఆయనను దుశ్శాలువ కప్పి సత్కరించారు.


మాట్లాడుతున్న ఎస్ఐ లావణ్య

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పాతపట్నం
విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని బొమ్మిక గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో శనివారం ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలపై రోజురోజుకు పెరుగుతున్న అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు, సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు వాడకం, వాటి వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అలాగే మైనర్లకు వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.త్రినాధరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


డబుల్ వీల్ మార్కర్స్‌తో రైతులు

డబుల్ వీల్ మార్కర్స్ పంపిణీ

జి.సిగడాం: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు ఆదేశాల మేరకు మండలంలో బాతువలో దుక్కుదున్నకుండా మొక్కజొన్న వేసిన రైతులకు డబుల్ వీల్ మార్కర్స్ పంపిణీ చేశారు. వేసవి కాలం సబ్సిడీపై కేవలం రూ.250కే రైతులకు భూసారా పరీక్ష చేస్తామని ఫౌండేషన్ సమన్వయ కర్త టి.మోహన్ రంగా రైతులకు తెలిపారు. అలాగే ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డబ్బ సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి

ఆమదాలవలస: సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి, ఆనందం కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని పిఎన్ కాలనీలో నివాసం ఉంటున్న దుంపల జగదీష్, స్వప్నల కుమార్తె పుట్టిన సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మందికి అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని లెపర్సీ కాలనీలోని పేదలు, వృద్ధులు, వికలాంగులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

ఆద్యంతం... ఆలోచింపజేశాయి

ఆకట్టుకున్న పరిషత్ నాటికలు

ప్రజాశక్తి- కవిటి
కవిటి మండలం బొరివంక గ్రామంలో కళింగ సీమ కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శించిన బల్లెడ అనసూయమ్మ స్మారక ఆహ్వానిత ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. ఈ పోటీల్లో భాగంగా శనివారం రాత్రి మొదట ప్రదర్శనగా గుంటూరు జిల్లాకు చెందిన శ్రీసాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' నాటిక సగటు రైలు ప్రయాణికుడ్ని ఆలోచనల్లో పడేసింది. ఖర్చు తక్కువ అని సగటు ప్రయాణీకుడు రైలులో ఖాళీ లేకపోయినా ఎన్నో బాధలు పడుతూ జనరల్ బోగీల్లో ప్రయాణిస్తుంటారు. ఆ సమయంలో అనుకోని రైలు ప్రమాదం జరిగితే, ఆ ప్రమాదంలో వాళ్ల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తే ఆ కుటుంబాన్ని ప్రభుత్వం సైతం ఆదుకునేందుకు ముందుకు రాదు. ఈ నేపథ్యంలో రైలు ప్రమాదంలో కొడుకును పోగొట్టుకున్న కథానాయిక సావిత్రమ్మ ప్రతీ రైలులో జనరల్ బోగీలు పెంచాలంటూ ఉత్తరాలు ద్వారా ప్రారంభించిన ఉద్యమం చివరికి ఆమెను జైలు పాలు చేస్తుంది. అయినా ధైర్యం కోల్పోకుండా ఆమె చేసిన పోరాటానికి చివరికి ప్రజలు సైతం మద్దతు పలుకుతారు. ఈ నాటికలో సావిత్రమ్మ పాత్రలో సురభి ప్రభావతి తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. పిటి మాధవన్ రచించిన ఈ నాటికకు ప్రముఖ సినీ క్యారెట్ ఆర్టిస్ట్ గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.
ఇక రెండో నాటిక తెలుగు కళాసమితి విశాఖపట్నం వారు ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత..?' అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగుపరిచేలా చట్టంలో చేసిన కొన్ని మార్పులతో కలిగే ఫలితాలు కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రభుత్వాలు, న్యాయస్థానాలు తెచ్చిన కొత్త చట్టాలతో నలిగిపోతున్న కుటుంబాలు, వివాహ వ్యవస్థ, అక్రమ సంబంధాలపై ప్రదర్శించిన నాటికను తిలకించిన సగటు ప్రేక్షకుడు ఈ సమాజం ఎటు పోతోంది, దీన్ని ఎవరు ప్రశ్నిస్తారు అనే ప్రశ్న తలెత్తేలా రచయిత పి.టి.మాధవ్ రచించారు. ఈ నాటికకు చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించగా నటులు కన్నబాబు, పిపి.వరప్రసాద్, హేమ, కృష్ణప్రసాద్, రాంబాబు, లాస్యలు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఈ పోటీలకు మనాపురం సత్యన్నారాయణ, కోరుకొండ బ్రహ్మానందం, కెవి మంగరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.


జనరల్ బోగీ నాటికలో ఓ సన్నివేశం

అధికారులు హాజరు కాని సమావేశాలు ఎందుకు?

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మండల సమావేశానికి విధిగా హాజరు కావాల్సిన అధికారులు గైర్హాజరు కావడంతో అటువంటి సమావేశాలు ఎందుకని వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, పలువురు సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ఐకెపి వెలుగు కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు సభ్యులు తమ సమస్యలను ప్రశ్నించినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు హాజరు కాకపోవడంతో సమాధానం చెప్పేందుకు అవకాశం లేకుండా పోయింది. టెక్కలి పెద్ద లక్ష్మీపురం మధ్య నడిచే ఆర్‌టిసి బస్సు సర్వీసును గతంలో రెగ్యులర్ సర్వీస్‌గా నడిచేదని, మరలా రెగ్యులర్ సర్వీస్‌గా నడపాలని, అలాగే టెక్కలి-నేలబంతు సర్వీస్ పునరుద్ధరించాలని సభ్యులు కోరారు. అలాగే కొత్తగా పలాస నుంచి మెళియాపుట్టి మీదుగా టెక్కలికి బస్ సర్వీస్ నడపాలని కోరారు. నేరాల నియంత్రణకు ప్రజల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటైతే నేరాలు అరికట్టేందుకు వీలుంటుందని దీనికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ పి.రమేష్‌బాబు కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎంఇఒ ఎం.పద్మనాభరావు, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, జగన్ మోహనరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరమ్మ

పక్కాగా రహదారి పనులు
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ
పక్కాగా రహదారుల పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ తెలిపారు. ఇటీవల 'పైపైనే రోడ్ల మరమ్మతులు' అనే వార్త ప్రజాశక్తిలో ప్రచురితమవ్వడంతో దీనిపై స్పందించిన ఆర్అండ్‌బి ఎస్ఇ పక్కాగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని అల్లెన గ్రామం నుంచి మరిడమ్మ ఆలయం వరకు మరలా జరుగుతున్న రహదారి పనులను పరిశీలించారు. పక్కాగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఇ తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షునిగా ఆనందరావు

ప్రజాశక్తి- కొత్తూరు
వైసిపి మండల అధ్యక్షునిగా గండివలస ఆనందరావు నియమితులయ్యారు. ఈయన భార్య గండివలస రత్నకుమారి ఎంపిటిసి-2గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రఘువర్మ ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస
ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యమ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు అన్నారు. శనివారం పట్టణంలో ఇంటింటికి వెళ్లి ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, బి.వి.ఎస్.ఎన్.మూర్తి, పి. సూర్య నారాయణ, ఆమదాలవలస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుందరరావు, బి.మహేష్, ఉపాధ్యక్షులు ఎ.శివరామకృష్ణ, సరుబుజ్జిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామన్న, డి.అనిల్ బాబు, ఉపాధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అప్పయ్యదొర
మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస
మాజీ ఎంపీ కీర్తిశేషులు హనుమంతు అప్పయ్యదొర అందరికీ ఆర్శనీయుడని మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆయన పార్టీ కార్యాలయంలో అపయ్యదొర 90వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లో విలువతో కూడుకున్న నాయకుడుగా అప్పయ్యదొర నిరూపించారన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలకు ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, బమ్మిడి సంతోష్, అల్లు రమణ, మన్మథరావు, ఖగేష్‌దొర, ఎర్రయ్య, ముకుంద పాల్గొన్నారు.
వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండిలో అప్పయ్యదొర జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతు రామ్మోహన్‌దొర, హెచ్.ముకుందరావు, బాలాజీ పాల్గొన్నారు.


పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అప్పలరాజు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పరీక్షలతో ప్రతిభా వికాసం

కవిటి: పరీక్షలతో విద్యార్థుల్లో ప్రతిభ వికసిస్తుందని భారతీయ విద్యా కేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అనిల్ అన్నారు. సంస్కృతి, ధర్మం జాతీయ తలకు సంబంధించి విద్యార్థులకు భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షను శనివారం నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శిరీష, కృష్ణకుమార్, జ్యోతి, అంజలి, రాజేశ్వరి, లక్ష్మి, సుహాసిని, ఝాన్సీ, మాదికమ్మ, అశోక్, భార్గవి, జ్యోతి పాల్గొన్నారు.

తెలంగాణ సిఎంకు ధన్యవాదాలు

పలాస: ఎస్‌సి వర్గీకరణకు కట్టుబడిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి దామెదర రాజనర్సింహరెడ్డికి మాదిగల సంఘ నాయకులు ఉర్నాన అప్పలరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎస్‌సి వర్గీకరణకు మొట్టమొదటి నుంచి అన్ని దశల్లో సహకరిస్తున్నారని అన్నారు. ఎస్‌సి వర్గీకణపై అసెంబ్లీలో తీర్మాణం చేసి కేబినేట్ ఆమోదం చేయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. యు.శంకర్, లండ చంద్రయ్య, బొబ్బిలి కృష్ణారావు, దుబ్బ పాపారావు, భీమరాజు, కోల సింహాచలం, పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

కవిటి: బెంతు ఒరియాలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి మత్రిపాటి పూర్ణ డిమాండ్ చేశారు. కవిటి బస్టాండ్ ఆవరణలో బెంతు ఒరియాలు చేస్తున్న నిరాహారదీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. మరోవైపు తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 409 రోజులకు చేరుకున్నాయి. అందులో భాగంగా శనివారం దీక్షలో తలపంపర, లండపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంతు ఒరియాల యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించి తమకు న్యాయం చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి తమ యువత, విద్యార్థులకు భవిష్యత్ మార్గం చూపించాలని కోరారు.

అరసవల్లి నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రతిరోజూ యాత్రికులకు అందిస్తున్న నిత్యాన్నదాన పథకం నిర్వహణకు ఆమదాలవలసకు చెందిన పొడుగు రంగారావు రూ.1,00,116 విరాళంగా అంద జేశారు. శనివారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. తన తండ్రి పొడుగు వెంకట రమణ (మురళి) జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ఆలయ ఇఒ వై.భద్రాజీకి అందజేశారు. అలాగే నగరానికి చెందిన మేడూరు ప్రసాదరావు, సుధ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు.

కనకదుర్గా భవానీ జాతర

పోలాకి: పోలాకి మండల కేంద్రంలో శ్రీ కనకదుర్గా భవానీ మాత 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు భవానీ, పల్లి రాజు భవానీ చేతులు మీదుగా ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ధర్మకర్తలు మాట్లాడుతూ ఈ జాతర మహోత్సవాలు ఐదురోజులు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోలాకి అయ్య భవానీ, సర్పంచ్, ఎంపిటిసి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రవికుమార్‌కు అభినందన

ప్రజాశక్తి- ఆమదాలవలస
ఎమ్మెల్యే కూన రవికుమార్ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఇటీవల పియుసి చైర్మన్‌గా ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎంపిక కావడంపై అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, గొండు రవి, నాగళ్ల మురళీధర్, బోనెల అప్పారావు, తంగి గురయ్య, రాడ విజయ్ కుమార్, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు విరాళం

పట్టణంలో రైతుబజారు వద్ద నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌కు విశ్రాంత ఉద్యోగి గొల్ల మల్లేశ్వరరావు రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లేశ్వరరావును అభినందించారు. పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌కు విరాళాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంపిడిఒ మునగవలస రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


రవికుమార్‌కు చెక్కును అందజేస్తున్న మల్లేశ్వరరావు

యడ్ల గోపాలంకు పురస్కారం
ఆకట్టుకున్న నాటిక పోటీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస
పట్టణంలోని పాలపోలమ్మ గుడి ఆవరణలో శనివారం నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు కళాప్రియులను ఆకట్టుకున్నాయి. రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో భాగంగా రెండవరోజు కార్యక్రమాల్లో భాగంగా సీనియర్ రంగస్థల కళాకారులు, కలియుగ నక్షత్రక పద్మశ్రీ యడ్ల గోపాలంను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని విద్యాసాగర్, పేడాడ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి పురస్కారం అందించారు. ముందుగా నిర్వహించిన సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి పౌరాణిక సాంఘిక, జానపద కళా ప్రదర్శనలతో ప్రజల్లో సృజనాత్మకత కల్పించడానికి ఎంతో దోహదపడతాయన్నారు. ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పించడానికి కళలు దోహద పడతాయన్నారు. రెండవ రోజు ప్రదర్శనలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన స్వేచ్ఛనాటిక, ఆంధ్రాకు చెందిన మరో రెండు నాటికలు పలువురు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బిజెపి కన్వీనర్ పేడాడ సూరపు నాయుడు, మాజీ డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, మాజీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావు, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, బొడ్డేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


యడ్ల గోపాలంను సత్కరిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న దళిత నాయకులు

దళితులపై చిన్నచూపు తగదు

శ్రీకాకుళం అర్బన్: బాధ్యత గల పదవిలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దళితులపై, దళిత సంఘాలపై చిన్నచూపు చూడడం తగదని దళిత సంఘాల జెఎసి నాయకులు పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో జెఎసి నాయకులు కళ్లేపల్లి రాం గోపాల్, కంఠ వేణు శనివారం విలేకర్లతో మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడులో చెరువుల ఆక్రమణ తొలగించడంతో నిరాశ్రయులైన దళితులు, బడుగు, బలహీనవర్గాల వారిని పరామర్శించేందుకు వెళ్లిన దళిత నాయకులపై ఎయిమ్స్‌పై విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం తగదన్నారు. దళితులపై ఆయన తీరు అభ్యంతర కరమన్నారు. ఎయిమ్స్ సంస్థ వ్యవస్థాకుడు పివి సునీల్ కుమార్‌పై చీప్ పాలిటిక్స్ మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు గురుమూర్తి, రమేష్, కొర్రాయి ప్రసాద్, పురుషోత్తం, రాంబాబు, అబ్బాస్, లింగాల దిలీప్, పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టునీ వదలరా?

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
మండలంలోని సీతాపురానికి చెందిన ఎర్ర చెరువు గట్టు మట్టి మాఫియా వశమవుతోంది. రెండు రోజులుగా ప్రొక్లెయినర్‌తో ట్రాక్టర్లు పెట్టి తవ్వుకుపోతున్నారు. ట్రాక్టర్ లోడు రూ.500 నుంచి రూ.700 వరకు విక్రయాలు చేస్తున్నారు. దీనిని సీతాపురానికి చెందిన చెరువు ఆయకట్టు రైతులు టి.బాలకృష్ణ, రాజారావు, మరో 10 మంది అడ్డుకున్నారు. అయినా మట్టి మాఫియా నుంచి బెదిరింపులకు పాల్పడడంతో రైతులు ఆందోన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ నుంచి ఎర్ర చెరువులో పేరుకుపోయిన మట్టిని తీసి చెరువు గట్టు నిర్మించారు. చెరువు గట్టు పటిష్టానికి దాదాపు రూ.80 లక్షలు వరకు ఉపాధి నిధులు ఖర్చు చేశారు. ప్రభుత్వ చెరువు గట్టు మట్టిని తరళించుకుపోయి రియట్ ఎస్టేట్ వెంచర్లకు, ఇతర అవసరాలకు తరలించుకుపోతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాఫియా నుంచి చెరువును కాపాడాలని రైతులు కోరుతున్నారు.


చెరువు గట్టు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

క్రైమ్ కార్నర్


కోటేశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో కోటేశ్వరరావు ఫైల్)

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస
కాశీబుగ్గ రాధాకాంత చెరువులో జారిపడి వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లికి చెందిన చిగులపల్లి కోటేశ్వరరావు (45) శనివారం మృతి చెందాడు. ఆంజనేయస్వామి మాలధారణ చేసిన ఆయన సమీపంలో ఉన్న చెరువుకి స్నానానికి దిగి గల్లంతాయ్యాడు. ఈ విషయాన్ని చూసిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్ల సహాయంతో సాయంత్రం వరకూ చెరువులో జల్లెడ పట్టినా ఆచూకీ లభించలేదు. సాయంత్రం ఐదు గంటల సమయంలో మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. మృతుడికి కోటేశ్వరరావుకు భార్య నాగరత్నం, 8వ తరగతి చదువుతున్న కుమారుడు హేమంత్ ఉన్నాడు. వీరి కుటుంబం కాశీబుగ్గలో ప్రస్తుతం నివాసం ఉంటుంది. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిఐ పి.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో శలగపేట వాసి మృతి

ప్రజాశక్తి- నౌపడ
సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడు పంచాయతీ శలగపేటకు చెందిన తామడ సింహాచలం (53) చెన్నయ్‌లో శనివారం మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సింహాచలం జీవనోపాధి నిమిత్తం చెన్నయ్‌లోని బిపిసిఎల్ కంపెనీలో ఓ కాంట్రాక్టర్ వద్ద పైప్‌లైన్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం విధులకు వెళ్లి పనిచేస్తుండగా పైప్‌లైన్ స్ట్రించ్ కూలిపోయి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సింహాచలం (ఫైల్)



మందస పిహెచ్‌సి

భయాందోళనలో వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- మందస
మండలంలో పిహెచ్‌సి ఓ మారుమూల ఉండటంతో రాత్రిపూట విధుల్లో ఉంటున్న వైద్య సిబ్బంది భయాందోళనలతో విధులను నిర్వహిస్తున్నా మన్నారు. రాత్రి సమయాల్లో ఇటు మందస, అటు మెలియాపుట్టి రోడ్డుకి ఆనుకుని ఉన్న పిహెచ్‌సికి రక్షణ గోడ కూడా సక్రమంగా లేదు. ప్రధాన రోడ్డు మార్గం కావడంతో అనుక్షణం భయం భయంతో అక్కడ సిబ్బంది విధులు నిర్వహిస్తు న్నామన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి వాచ్‌మెన్‌ను నియమించాలని కోరుతున్నారు.

ధనుంజయ్ రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
మండలం టి.బరంపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారులు, శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా నియమితులైనట్టు సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పాలోజు రాజకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తనమీద నమ్మకంతో జిల్లా అధ్యక్షులుగా నియమించిన వ్యవస్థాపక ఆర్గనైజేషన్‌కు ధనుంజయ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ధనుంజయ రెడ్డికి శ్రీ మహతి సాంస్కృతిక సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, కళా భారతి కళాకారుల సంఘం ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట కళాకారులు అభినందనలు తెలియజేశారు.


ధనుంజయ రెడ్డి

మబగాంలో అన్నదానం

ప్రజాశక్తి- పోలాకి
భీష్మ ఏకాదశి సందర్భంగా మబగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా గార మండలంలో గల సాలిహుండంలో వెలసి ఉన్న వేణుగోపాల స్వామిని దర్శించుకునేందుకు యాత్రికులు వేలసంఖ్యలో ఈ దారి గుండా వెళ్లి వస్తుంటారు. యాత్రికుల ఆకలి తీర్చేందుకు మబగాం, వనిత గ్రామాల మధ్యలో గల జీడితోటలో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


నేలకొరిగిన అరటి గెలల పందిరి

కూలిన పందిరి

నౌపడ: సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలో శనివారం అరటి గెలలు ఉత్సవంలో గోడ కూలి అరటి గెలల పందిరి ఒకసారిగా కూలిపోయింది. భీష్మ ఏకాదశి సందర్భంగా ఏటా ఇక్కడ మూడు రోజులు పాటు అరటి గెలలు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలలు, ఒడిశా రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున యాత్రకు వచ్చి అరటి గెలలు కడుతుంటారు. దీంతో బరువు ఎక్కువ కావడంతో పక్కనే ఉన్న గోడ విరిగి అరటి గెలలు కట్టిన పందిరి ఒకసారిగా పక్కకు ఒరిగింది. వేలాది మందిగా వచ్చిన యాత్రికులు ఉండగానే ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు కూలిన పందిరిని తొలగించి, యాత్రికులకు ఇబ్బంది లేకుండా చేశారు. మొదటిరోజు ఉత్సవాలకు భారీ సంఖ్యలో యాత్రికులు తరలిరావడంతో సంతబొమ్మాళి, నౌపడ పోలీసులు ఏర్పాట్లు చేశారు.